## క్లుప్తంగా

### కొనసాగుతున్న గంగజాతర



ఆలయ సన్నిధిలో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

**దొర్నిపాడు:** మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గంగజాతర రెండు రోజులగా కొనసాగుతోంది. రెండో రోజు శనివారం పుట్టబంగారు తెచ్చుట, పొంగుపాలు యాగం, శమీవృక్ష యాగం, బొల్లేవుల పాట్లాట కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆదివారం పాలేటి యాగం,గ్రామస్తులు బోనాల సమర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. కాగా రెండో రోజు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.మాజీ సొసైటీ ప్రెసిడెంట్ వెంకట స్వామి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు పయిడేల శివరామిరెడ్డి, కాకనూరు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ఉయ్యాలవాడ :** మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### వక్ఫ్ ఆస్తులను పరిరక్షించండి

**నంద్యాల(న్యూటౌన్):** వక్ఫ్ ఆస్తులను కబ్జాదారుల నుంచి రక్షించి మైనార్టీ సంక్షేమానికి ఉపయోగించాలని సీపీఐ అనుబంధ సంఘమైన ఇన్సాఫ్ కమిటీ నాయకులు కోరారు. శనివారం ఈ మేరకు వక్ఫ్ టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ మసూద్ ఇబ్రహీం, వక్ఫ్ బీఎండబ్ల్యూ నబినా పర్వీన్‌కు వినతి పత్రం అందజేశారు. కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకొని మైనార్టీ సంక్షేమానికి ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు జైలాని బాషా, కలాం,బాషా,మాబు,మధుబాషాపాల్గొన్నారు.

### హుండీ సొమ్ము లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

**శిరివెళ్ల:** నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో ఆలయానికి 9 నెలలకు సంబంధించి రూ. 4.84 లక్షల ఆదాయం సమకూరింది. చైర్మన్ రేవనూరు ఆంజనేయరెడ్డి, ఈఓ నరసయ్య, దర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

### షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారులు

**గోస్పాడు:** గ్రామాల్లో అర్హులైన చిన్నారులందరికీ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలను వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి కాంతరావునాయక్ సూచించారు. మండలంలోని ఎం.చింతకుంట్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలు, వ్యాక్సిన్ల వివరాలు, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్‌ల పంపిణీ, హైరిస్క్ గర్భిణుల పట్ల అనుసరిస్తున్న ప్రణాళిక వంటి వాటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

### ఘనంగా డాక్టర్స్ డే

**నంద్యాల(న్యూటౌన్):** పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో శనివారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వైద్యులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే డాక్టర్లు పునర్జన్మనిస్తారని కొనియాడారు. బీసీ రాయ్ జన్మదినమైన జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటారన్నారు.

### జయప్రదం చేయండి

**నంద్యాల(న్యూటౌన్):** ఏఐఎస్ఏ పదవ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి నాగరాజు కోరారు. శనివారం సంఘం జిల్లా కార్యదర్శి నాగార్జున, డీఈఓ సుధాకర్‌రెడ్డితో కలిసి మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. నాగరాజు మాట్లాడుతూ ఆగస్టు 9, 10, 11 తేదీల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జరిగే ఏఐఎస్ఏ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్.. విద్యాప్రగతి, ప్రజాస్వామ్యం అనే లక్ష్యాలతో చదువు కోసం పోరాడుతుందన్నారు. యువరాజ్, చరణ్, అబి, కృష్ణ, కలాం పాల్గొన్నారు.

# ‘జగనన్న సురక్ష’తో జవాబుదారీతనం



కోటకొండలో మహిళకు ధ్రువ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, అధికారులు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- నియోజకవర్గంలో ఉద్యమంగా 'జగనన్న సురక్ష'
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

**ఆళ్లగడ్డ:** జవాబుదారీతనానికి సరికొత్త నిర్వచనం జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నియోజకవర్గంలో శనివారం ఉద్యమంగా మొదలుపెట్టారు. ఆరు మండాలల పరిధిలోని మహదేవపురం (శిరివెళ్ల), కోటకొండ (రుద్రవరం), అహోబిలం (ఆళ్లగడ్డ), చాగలమర్రి - 1, తుడుములదిన్నె (ఉయ్యలవాడ) గుండుపాపల (దొర్నిపాడు) గ్రామ సచివాలయాల్లో చేపట్టిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరై ప్రారంభించి లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉండి పథకాలకు ఏ ఒక్కరూ దూరంగా ఉండిపోరాదని సీఎం జగనన్న ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆరు మండాలల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మొదటి రోజు ధ్రువ పత్రాలు పొందిన లబ్ధిదారులు..

| మండలం | సచివాలయం | జారీచేసిన ధ్రువ పత్రాలు |
|---|---|---|
| రుద్రవరం | కోటకొండ | 280 |
| దొర్నిపాడు | గుండుపాపల | 380 |
| శిరివెళ్ల | మహదేవపురం | 376 |
| ఉయ్యలవాడ | తుడుములదిన్నె | 209 |
| ఆళ్లగడ్డ | అహోబిలం | 293 |
| ఆళ్లగడ్డ టౌన్ | వార్డు సచివాలయం - 9 | 482 |
| చాగలమర్రి | చాగలమర్రి - 1 | 269 |

### ఆధార్ లింక్ చేయించి, ధ్రువ పత్రాలు అందజేశారు



ఆధార్ నంబర్‌కు సెల్ నెంబర్ లింక్ లేక పోవడంతో ధ్రువ పత్రాలకు దరఖాస్తుకున్నా అందలేదు. సెల్ నంబర్ లింక్ చేయించుకోవడానికి ఇంతకుముందు ప్రయత్నించినా పని కాలేదు. అయితే జగనన్న సురక్ష పథకంలో భాగంగా అధికారులు,వలంటీర్లు మా ఇంటి వద్దకు వచ్చి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి శనివారం సచివాలయం వద్దకు పిలిపించి సమస్యను పరిష్కరించడమే కాకుండా నా కుమార్తెలకు విద్యాదీవెన, వసతి దీవెనకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు.

– షాబిరున్,చాగలమర్రి

### జగనన్న సురక్షతో చేయూత పథకానికి అర్హత



మేం నూనెపల్లెలో నివాసం ఉంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం అందించే పథకాల గురించి మాకు ఎవరూ చెప్పలేదు. కానీ నేడు అలా జరగడం లేదు. అన్నీ మా ఇంటికే అందుతున్నాయి. చేయూత పథకానికి నాకు అర్హత ఉన్నా కుల ధ్రువ పత్రం లేక దరఖాస్తు చేసుకోలేక పోయాను. ఇప్పుడు మా ఇంటి వద్దకే అధికారులు వచ్చి ధ్రువ పత్రం అందజేశారు. వారే దరఖాస్తు చేస్తామన్నారు. మాలాంటి వారికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో మేలు చేకూరుస్తాయి.

– ఇమాంబీ, నూనెపల్లె

# సమస్యలకు సత్వర పరిష్కారం



ధ్రువ పత్రాలు అందిస్తున్న పీపీ నాగిరెడ్డి, అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి ప్రభాకర్

**గోస్పాడు:** జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో శనివారం మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో వివిధ ధ్రువ పత్రాల కోసం 565 దరఖాస్తులు అందగా ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, డీటీ రామచంద్రారావు, ఇతర మండల అధికారులు, ఆయా శాఖల సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అక్కడికక్కడే ధ్రువ పత్రాలను అందించారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్‌లు పుల్లయ్య, మహేశ్వరమ్మ, ఎంపీటీసీ మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాంతారెడ్డి పాల్గొన్నారు.

**నంద్యాల(రూరల్):** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప వద్దకే 11 రకాల ధ్రువ పత్రాలను అందిస్తున్నామని డ్వామా పీడీ రామచంద్ర రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చాపిరేవుల, కానాల–01 గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించిన దరఖాస్తు చేసుకున్న 809 మందికి కుల, ఆదాయ, ఆధార్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. వారు మాట్లాడుతూ చాపిరేవులలో క్యాస్ట్ 184, ఇన్‌కం 176, ఆధార్ 83, ఫ్యామిలీ మెంబర్ 2, ధ్రువ పత్రాలు అందజేశామని చెప్పారు. కానాల– 01 సచివాలయంలో క్యాస్ట్ 190, ఇన్‌కం 181, ఆధార్ 12 సేవలను అర్హులకు అందించామన్నారు. ఎంపీడీఓ సుగుణశ్రీ , ఈఓఆర్‌డీ మహీధర్ రెడ్డి, ఆర్‌ఐ యుగంధర్ రెడ్డి, సర్పంచులు బావమ్మ, దేవి, నాయకులు, విజయ శేఖర్ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, దుబ్బన్న దూదేకుల కాశిం పాల్గొన్నారు.

### కుల, ఆదాయ ధ్రువ పత్రాలు పొందాను



మా పిల్లల చదువు కోసం కుల, ఆదాయ ధ్రువ పత్రాలు అవసరమయ్యాయి. గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు అందజేసిన కొద్దిసేపటికే అధికారులు ఉచితంగా ధ్రువ పత్రాలు అందజేశారు. ఇంత త్వరగా పనులయ్యేలా చేయడం నిజంగా అభినందనీయం. మాకు ఇబ్బందులు తప్పాయి.

–లక్ష్మీనరసమ్మ, జూలేపల్లె, గోస్పాడు మండలం

### ఆర్థిక సాయం చెక్కు అందజేత



మృతుడి భార్యకు చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే

**శిరివెళ్ల:** మహదేవపురం గ్రామానికి చెందిన రైతు గజ్జల మధు ఈ ఏడాది ఫ్రిబవరి21న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ప్రభుత్వం ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం మంజూరు చేసింది. శనివారం ఇందుకు సంబంధించి రూ.7లక్షల విలువైన చెక్కును మృతుడి భార్య లక్ష్మీదేవికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అందజేశారు. సర్పంచు పెద్ది రమణయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘువరెడ్డి, ఉపాధ్యక్షుడు నరహరి, దేవస్థానం మాజీ చైర్మన్ జయలక్ష్మమ్మ, ఏఓ సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందూరి ప్రతాపరెడ్డి, ఎంపీపీ నాయక్ వసీం, బీ.అబ్దుల్ సలాం, బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న, నాయకులు శివరాం, ఉశేనిరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతులు



విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేసిన దృశ్యం

**నంద్యాల(న్యూటౌన్):** ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ సౌజన్యంతో రెండు రోజులుగా నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో పోటీలు జరిగాయి. బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా నంది పైప్స్ ఎండీ సుజల, దిశ డీఎస్పీ పి.మారుతిరావు, తహసీల్దార్ రవికుమార్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వంశీధర్ హాజరయ్యారు. ఏపీ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ద్వారకానాథ్, అంకమ్మ చౌదరి రాష్ట్రస్థాయి పోటీల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అండర్–11 ఈస్ట్ గోదావరి జిల్లా, అండర్–13 ఒంగోలు, అండర్–15 వైజాగ్, అండర్–17 నెల్లూరు, అండర్–19 తిరుపతిలో, సీనియర్స్ విభాగం కడపలో జరుగుతాయని వివరించారు. సంఘం ఉపాధ్యక్షులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

### గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

**మహానంది:** జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాస్కరనాయుడు కోరారు. నందిపల్లెలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో 1,554 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 414 గృహాలు పూర్తయ్యాయని చెప్పారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర రెడ్డి, హౌసింగ్ ఏఈ వాసుదేవుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**పోషకాహారంతో రక్తహీనత నివారణ**

ఆకు, కాయగూరలతో పాటు నిత్యం వాడే పదార్థాల్లో పోషకాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. జాతీయ సికిల్ సెల్ అనీమియా నిర్మూలన ఉద్యమం కార్యక్రమంలో భాగంగా శనివారం మహానందిలోని పోచా డార్మెటరీ భవనంలో గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి, మహానంది సర్పంచ్ చలంచలం శిరీష, ఎంపీహెచ్ఈఓ హుసేన్ రెడ్డి, విజయ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### 5నుంచి నంద్యాలలో జగనన్న సురక్ష క్యాంపులు

**నంద్యాల (సిటీ):** పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగే తేదీలను అధికారులు శనివారం వార్డుల వారీగా ప్రకటించారు.

| తేదీ | వార్డులు |
|---|---|
| 05 | నడిగడ్డ, పార్క్‌రోడ్, హరిజనవాడ, మాల్దార్‌పేట, జగజ్జనని నగర్ |
| 07 | ఫారూఖ్ నగర్, బాల్కొండహాల్, గుడిపాటిగడ్డ, ముల్లాన్‌పేట, బాలాజీకాంప్లెక్స్. |
| 12 | చాంద్‌బాడ, సరస్వతినగర్, గోపాల్ నగర్, ఎస్బీఐ కాలనీ, టెక్కె |
| 14 | ఎన్జీఓ కాలనీ, విశ్వనగర్, పొన్నాపురం కాలనీలు లలితానగర్, ఏకలవ్యనగర్ |
| 19 | రైతునగరం, దేవనగర్ |
| 21 | సాయిబాబనగర్, సాదిక్‌నగర్, విజయపురికాలనీ, బొమ్మలసత్రం, మూలసాగరం, జ్ఞానాపురం. |
| 25 | సలీంనగర్, మున్సిపల్‌ఆఫీస్, ఎంఎస్‌నగర్, వైఎస్సార్‌నగర్, నందమూరి నగర్ |
| 26 | విద్యానగర్, ఊడుమాలపురం |
| 27 | రామనాథ్‌రెడ్డి నగర్, రోజకుంట, బైర్మల్‌వీధి, నీలివీధి, తెలుగుపేట |

### చర్యలు తీసుకోవాలి

**నంద్యాల(అర్బన్):** సీనియర్ న్యాయవాది డోన్ వైఎస్సార్‌సీపీ నేత శీలం భాస్కర్ నాయుడుపై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న కోరారు. ఈ మేరకు డోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడులు చేస్తే సహించేది లేదన్నారు.





ఆలమూరులో నిర్మితమవుతున్న పీహెచ్‌సీ నూతన భవనం, అంతర్భాగంలో పనులు చేస్తున్న కూలీలు

# వేగంగా పీహెచ్‌సీ నిర్మాణ పనులు

**రుద్రవరం:** మండలంలోని ఆలమూరు ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించిన నూతన భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగతున్నాయి. త్వరలోనే నూతన భవనం వినియోగంలోకి వస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు. గతంలో ఉన్న భవనం దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. మోస్తరు వర్షం కురిసినా భవనం పాటుకెత్తేది. దీంతో అక్కడ కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు మొదట పనులు జరిపించడంలో కాస్త ఆలస్యం అయనప్పటికీ ప్రస్తుతం వేగవంతం చేశారు. అన్ని వసతులతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేయడం, గదుల్లో బండ పరుపు, తలుపులు, కిటికీలు వంటివి అమర్చే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

# కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



వక్ఫ్ ఆక్రమిత స్థలంలో బోర్డు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు



వక్ఫ్ స్థలాలల్లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు
- వక్ఫ్ బోర్డ్ స్పెషల్ ఆఫీసర్ షరీన్ బేగం
- స్థలాల్లో బోర్డుల ఏర్పాటు

**నంద్యాల(సిటీ):** నంద్యాల జిల్లాలో సుమారుగా 11,735 ఎకరాల మేర ఈ వక్ఫ్ బోర్డుకు సంబంధించి భూములు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 2019లో నంద్యాల పట్టణంలోని నూనెపల్లె–రైతునగరం ప్రాంతాల మధ్య సుమారు 75 ఎకరాలకు పైగా భూములున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా నాడు అధికారులు విఫల యత్నం చేశారు. అలాగే రాష్ట్రంలో మొదటి సారిగా వక్ఫ్ ఆస్తుల్లో చేపట్టిన అక్రమ కట్టడాల తొలగింపు పనులను శుక్రవారం నుంచి అధికారులు చర్యలు చేపట్టారు.

**అక్రమ కట్టడాల తొలగింపు**

నూనెపల్లె–రైతునగరం ప్రాంతాల మధ్య ఉన్న వక్ఫ్ స్థలాల్లో నున్న అక్రమ కట్టడాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశాలతో తొలగించారు. ఇందుకు సంబంధించి 231వ సర్వే నంబర్‌లో 3.89సెంట్లు, 47వ సర్వే నంబర్‌లో 7.48సెంట్లతో పాటు 22వ సర్వే నంబర్‌లో 5.92 సెంట్లకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలను వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం తొలగించి బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణంలో శుక్ర, శని వారాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వక్ఫ్ బోర్డు స్పెషల్ ఆఫీసర్, సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ బోర్డు షేక్ షరీన్ బేగం, డిస్ట్రిక్ట్ మైనార్టీ ఆఫీసర్ షేక్ సబియా పర్వీన్, జిలా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, సూపరింటెండెంట్ ఇనాయతుల్లా, టాస్క్ ఫోర్స్ ఆఫీసర్ విజయవాడ ఇబ్రహీం, వక్ఫ్ సర్వేయర్లు శ్రీనివాస్, జావిద్, తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

### వక్ఫ్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడం నేరం

వక్ఫ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరం. వాటిని ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్ట ప్రకారం జిల్లా జాయింట్ అధికారుల సమన్వయంతో వక్ఫ్ భూముల పరిరక్షకు పని చేస్తున్నాం. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా, వక్ఫ్ బోర్డు సెక్రటరీ ఇంతియాజ్ ఆదేశాలతో, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చొరవతో వక్ఫ్ స్థలాలు, భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– షేక్ షరీన్ బేగం, స్పెషల్ ఆఫీసర్ వక్ఫ్ బోర్డు, విజయవాడ

### బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేటు పాఠశాల బస్సు



తీవ్రంగా గాయపడిన ఓబులేసు

**చాగలమర్రి:** మండలంలోని చిన్నబోధనం గ్రామ సమీపంలోని రహదారి మలుపు వద్ద శనివారం సాయంత్రం ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఐడీఎస్ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు.. బైక్‌ ఢీ కొన్న సంఘటనలో ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. ఓబులేసును స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. వివరాలు..మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓబులేసు మరో వ్యకితో కలిసి ఏపీ39జెఎం 8092 అనే నంబరు గల బైక్‌పై వెళ్తుండగా చిన్నబోధనం సమీపంలో ఆళ్లగడ్డ వైపు నుంచి వస్తున్న ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొట్టింది. దీంతో ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు.

### రైతులకు రశీదులు ఇవ్వాలి

**దొర్నిపాడు:** ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణాదారులు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. శనివారం మండలంలోనిగుండుపాపల గ్రామంలోని సొసైటీ, ఇతర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ బోర్డులపై ధరల పట్టికను ప్రదర్శించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. కాలం చెల్లిన రసాయన మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఏఏ గురుగోవర్దన్ ఉన్నారు.

### ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**నంద్యాల(న్యూటౌన్):** మహిళలు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శిల్పా ఇన్ఫోటిక్ డైరెక్టర్ శిల్పా నాగినిరెడ్డి సూచించారు. శనివారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన ఉమెన్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారు.

### నిద్రలేపి..పింఛన్ అందజేసి



దొర్నిపాడులో తెల్లవారుజామునే దివ్యాంగుడు వెంకట నరేంద్ర ఇంటికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకట పుల్లయ్య

**దొర్నిపాడు:** అవ్వా తాతలూ.. లేవండి.. పింఛన్ తీసుకోండంటూ వలంటీర్లు నిద్రలేపి మరీ వైఎస్సార్ పింఛన్ కానుకను శనివారం అందజేశారు. శనివారం మండలంలో 3,674 పింఛన్లు ఉండగా తొలిరోజే 3,412 మందికి సొమ్ము అందజేశారు. కొందరు ఊర్లోలేని కారణంగా వంద శాతం పంపిణీ పూర్తి చేయలేకపోయామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు.

### పంటల బీమా మంజూరు

**చాగలమర్రి:** గతేడాది ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పరిహారం మంజూరు చేసిందని వ్యవసాయాధికారి రంగనేతాజీ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.2,77,66,069 పరిహారం మంజూరైందన్నారు. ఈ పంటల బీమా అర్హుల జాబితాను మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచామని చెప్పారు. పత్తి పంటకు సంబంధించి 279 మంది రైతులకు రూ.88.8 లక్షలు, ఉల్లి పంటకు 597 మంది రైతులకు రూ.47.54 లక్షలు, వాతావరణ బీమా పథకం కింద 450 మంది పత్తి రైతులకు రూ.1.40 కోట్లు, వేరు శనగ పంట వేసిన ఒక్కోక్క రైతుకు రూ.33 వేలు మంజూరైందని వివరించారు. జాబితాలపై అభ్యంతరాలుంటే ఈ నెల 4వ తేదీ లోపు ఆర్బీకేల్లో తెలియజేయాలని సూచించారు.

**ఉయ్యాలవాడ :** గత ఖరీఫ్‌లో మండలంలో వాతావరణం మార్పులు, వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పరిహారం విడుదల చేసిందని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ శనివారం తెలిపారు. వరి 402 ఎకరాలకు సంబంధిచి 149 మంది రైతులకు రూ. 15,27,302, పత్తి 1,973 ఎకరాలకు సంబంధిచి 767 మంది రైతులకు రూ. 25,33,227, ఉల్లి ఒక ఎకరాకు రూ. 16,560 రైతుల వ్యక్తిగత ఖాతాల్లో త్వరలో జమవుతుందని ఏఓ చెప్పారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

**ఆళ్లగడ్డ:** ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ యువతను మోసిన ఐదుగురిపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఆదర్శ కాలనీకి చెందిన రామచంద్రారెడ్డితో పాటు మరో ఆరుగురితో.. జంబులదిన్నెకు చెందిన రామయ్యతో పాటు మరో నలుగురు కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ.24 లక్షలు వసలూ చేశారు. ఎన్ని రోజులు గడిచినా, పలుమార్లు విచారించిన పట్టించుకోకపోవడం, ఉద్యోగాలు ఇప్పించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు.

# సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరి



రైతుకు బీపీటీ-3082 విత్తన సంచులు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

**దొర్నిపాడు:** సాగుకు ముందు ప్రతి పంటకు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏరువాక సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్‌బాబు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని అమ్మిరెడ్డినగరం గ్రామంలో పర్యటించి ఆర్‌బీకేను పరిశీలించారు. వరిలో బీపీటీ–3082 చిరు సంచులను రైతులకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో నున్న నూతన వంగడాల గురించి, పాటించవల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులను వివరించారు. వరి పంటలో జీవన ఎరువుల వినియోగం, విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఏఓ(డీఆర్‌సీ) ప్రభావతమ్మ, వీఏఏ పెద్దయ్య పాల్గొన్నారు.